



సీఎం రేవంత్‌రెడ్డికి మొక్కను అందిస్తున్న ఫ్యూచర్ సిటీ అథారిటీ కమిషనర్ శశాంక



సమ్మిట్‌లో అతిథుల సందడి





రెండు రోజుల పాటు హంగులు, ఆర్భాటాలతో కొనసాగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ మంగళవారం సాయంత్రం జరిగిన డ్రోన్ షోతో విజయవంతంగా ముగిసింది. ఈ సమావేశాలకు 6 ఖండాలు, 44 దేశాలతో పాటు మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన దాదాపుగా 2 వేల మందికిపైగా అతిథులు హాజరయ్యారు. చివరి రోజు బాలీవుడ్, టాలీవుడ్ నటుల రాకతో సందడిగా మారింది. 8, 9 తేదీల్లో జరిగిన సమావేశాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముగియడంతో అధికార యంత్రాంగా ఊపిరి పీల్చుకుంది. కాగా, నేటి నుంచి ఈ ప్రాంగాణాన్ని తిలకించేందుకు మూడు రోజుల పాటు సందర్శకులను అనుమతించనున్నారు.

సమ్మిట్ విజయవంతంపై హర్షం

గత 22 రోజుల పాటు 25 శాఖల అధికారులు శ్రమించి 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన గ్లోబల్ సమ్మిట్ సమావేశాలు విజయవంతం కావడంతో ఆయా శాఖల ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. 8వ తేదిన ప్రారంభమైన సమావేశాలు మంగళవారం రాత్రి డ్రోన్ షోతో ముగిశాయి. కాగా, సమ్మిట్ ప్రాంగాణాన్ని తిలకించేందుకు నేటి నుంచి (బుధవారం) మూడు రోజుల పాటు సందర్శకులను అనుమతించనున్నారు.



ప్రత్యేక ఆకర్షణగా డ్రోన్ షో

గ్లోబల్ సమ్మిట్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన డ్రోన్ షో అతిథులను ఆకట్టుకుంది. ఈ షోను తిలకిస్తున్న అతిథులు చప్పట్లు కొడుతూ డ్రోన్ షోను ఆసక్తిగా తిలకించారు. బేగరికంచ, మీర్కాన్‌పేట గ్రామాల ప్రజలు కూడా షోను ఆసక్తిగా తిలకించారు.

రెండో రోజూ అదే సందడి

మీర్కాన్‌పేట్‌లో ముగిసిన రైజింగ్ గ్లోబల్ సమ్మిట్



- అలరించిన ప్రత్యేక డ్రోన్ షో
- తరలివచ్చిన పారిశ్రామికవేత్తలు
- ఆకట్టుకున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల స్టాల్స్
- నేటి నుంచి మూడు రోజుల పాటు సందర్శకులకు అనుమతి

రంగారెడ్డి అర్బన్/కందుకూరు/షాద్‌నగర్/ మహేశ్వరం/ కొందుర్గు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది. దేశ, విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, విద్యారంగాలకు చెందిన వారు, విదేశీ రాయబారులు, ఆయా దేశాలకు చెందిన నిష్ణాతులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. మంగళవారం ప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీపై డాక్యుమెంటరీని ఆవిష్కరించింది. పెట్టుబడులు సైతం వెల్లువలా వస్తుండటం గమనార్హం. పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందాలు చేసుకుంది.



ఫ్యూచర్ సిటీ నమూనాను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

అత్యాధునిక నగర నిర్మాణానికి..

ప్రభుత్వం.. భారత్ ఫ్యూచర్‌సిటీని అత్యాధునిక హంగులతో నిర్మించేందుకు అడుగులు వేస్తోంది. గ్లోబల్ సమ్మిట్‌లో ఎఫ్‌సీడీఏ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి ప్రణాళిలను ప్రభుత్వం ప్రపంచం ముందు ఉంచింది. రానున్న రోజుల్లో శ్రీశైలం, నాగార్జునసాగర్ రెండు ప్రధాన రహదారులు, రాజధానికి అనుసంధానంగా 30వేల ఎకరాల్లో అత్యాధునక నగరాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కందుకూరు, మహేశ్వరం, యాచారం, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు మండలాల్లోని 56 గ్రామాల పరిధిలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాంతంలో రెసిడెన్సియల్, కమర్షియల్, ఇండస్ట్రీయల్, వినోద, గ్రీన్‌జోన్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. రియల్ఎస్టేట్ ప్రధానం కాకుండా అన్ని రంగాలను ఈ ప్రాంతంలో నెలకొల్పేలా చర్యలు చేపట్టనుంది.

టూరిజంపై ఫోకస్

దేశంలో క్రీడారంగం అభివృద్ధి

మిగతా 6వ పేజీలో...

ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటుపై ప్రభుత్వం నవంబరు 18న నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి ఈ నెల 7వ తేదీ రాత్రి వరకు మంత్రులు, ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం చకచకా ఏర్పాట్లు పూర్తి చేసింది. అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని ఏర్పాట్లు చేశారు. రోడ్ల నుంచి అతిథులు బస చేసే హోటళ్ల వరకు అన్ని వసతులు, పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. సమ్మిట్ జరిగే సమీపంలోనే ఏడు ప్రాంతాల్లో పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేశారు. వీవీఐపీలు, వీఐపీలు వస్తున్న వాహనాలకు అంతరాయం కలుగకుండా అక్కడక్కడ ట్రాఫిక్‌ను మళ్లించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరంలోని పలు కూడళ్లతోపాటు మీర్కాన్‌పేట్‌లోని సమ్మిట్ జరిగే ప్రాంతం వరకు వేలాది వాహనాలు తరలిరావడంతో, అడుగడుగునా పోలీసులను అందుబాటులో ఉంచారు. రహదారిపై ట్రాఫిక్ పోలీసులు నిరంతరం వాహనాలకు నిలుపకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దేశ, విదేశాలకు చెందిన అతిథులు తిరిగి పయనం పట్టడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.



గ్లోబల్ సమ్మిట్ వద్ద భారీగా వాహనాల పార్కింగ్

ఆమె ఓటే శాసనం

- పంచాయతీల్లో మహిళా ఓటర్లే కీలకం
- ఎవరి వైపు మొగ్గు చూపితే వారిదే గెలుపు
- అతివ చేతిలోనే అభ్యర్థుల గెలుపోటములు
- 17 మండలాల్లోనూ వారిదే అగ్రభాగం



జిల్లా ఓటర్ల వివరాలు:

మొత్తం	6,98,469
పురుషులు	3,43,688
మహిళలు	3,54,765
ఇతరులు	16

వికారాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల్లో మహిళలే న్యాయ నిర్ణేతలుగా మారారు. జిల్లాలో మూడు విడతల్లో జరుగుతున్న ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను అతివలే నిర్ణయించనున్నారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా, వాటిలో మూడు మండలాలు మినహా మిగతా 17 మండలాల్లో మహిళలే అధిక సంఖ్యలో ఉన్నారు. మర్పల్లి, నవాబ్‌పేట్, చౌడాపూర్ మినహా మిగతా మండలాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ మండలాల్లో మహిళా ఓటర్లు ఏ అభ్యర్థి వైపు మొగ్గు చూపితే వారు విజయం సాధించనున్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉండడంతో వారిని ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. సర్పంచ్, వార్డు పదవులకు పురుషులు పోటీ చేస్తున్నా వారు తమ సతీమణులు, కూతుళ్లు, కోడళ్లు, తల్లులతో ప్రచారం చేయిస్తూ మహిళా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో మహిళలను ఏకం చేసే మహిళా పొదుపు సంఘాలతో ఎవరికి వారు రహస్య సమావేశాలు నిర్వహిస్తూ వారికి హామీలు గుప్పిస్తున్నారు. సంఘాలకు అవసరమైన వస్తు సామాగ్రి, ఫర్నిచర్ సమకూర్చడంతో పాటు సంఘాలకు ఆర్థికంగా బాసటగా ఉండేందుకు సహకారం అందించేలా ఒప్పందాలు కూడా చేసుకుంటున్నారు.

అతివలే అధికం

జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 594 పంచాయతీలు, 5,058 వార్డులు ఉండగా, వాటికి మూడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. జిల్లాలో 6,98,469 మంది ఓటర్లు ఉండగా, వారిలో 3,43,688 మంది పురుషులు, 3,54,765 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 11,077

మిగతా 8వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు



జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మోమిన్‌పేట	6.9
రంగారెడ్డి	మంగల్‌పల్లి	7.6
మేడ్చల్	కేశవరం	11.0

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా



సమావేశంలో మాట్లాడుతున్న స్నేహ మెహ్రా

వికారాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరగాలని ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. మంగళవారం మొదటి దశ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలీసుల సన్నద్ధతను సమీక్షించి పోలీస్ స్టేషన్ల వారీగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ అధికారి తన బాధ్యతను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించాలని, మద్యం, డబ్బు, వంటి ప్రలోభాల పంపిణీపై నిఘా పెట్టాలన్నారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు, ప్రేరేపించే సమాచారాన్ని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజున ప్రతి ఓటరు తన ఓటును భయపడకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేస్తామన్నారు. పోలీస్ సిబ్బందికి చేయాల్సిన చేయకూడనివి స్పష్టంగా తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ సరోజా, ఎస్‌బీఐ డీవీపీ రాజు, సబ్ డివిజనల్ డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతాం

కలెక్టరేట్‌లలో ఘనంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

మేడ్చల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆవిష్కరించారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా నృత్యాలు, పాటలు ప్రదర్శించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి కలెక్టర్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతూ బంగారు తెలంగాణ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషిస్తాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టరేట్‌లో..



మేడ్చల్ కలెక్టరేట్‌లో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్లు

ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉదయం 10 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాశ్, డీఎంహెచ్‌వో ఉమాగౌరి, ఆయా శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రలోభాల పర్వం షురూ



- ముగిసిన తొలి విడత ప్రచారం
- మద్యం దుకాణాలకు తాళం
- మద్యం, నోటుతో ఎర వేస్తున్న నేతలు

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో ప్రలోభాల పర్వానికి తెరతీశారు. పంచాయతీ బరిలో నిలిచిన అభ్యర్థులు నువ్వా.. నేనా అన్న తీరులో హోరెత్తించిన ప్రచారానికి మంగళవారం సాయంత్రం తెరపడింది. దీంతో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు రహస్యంగా తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో తొలి విడత ఎన్నికలు తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో 262 పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, వాటిలో 39 పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవమయ్యాయి. 2,198 వార్డుల్లో 19 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేవు, 652 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 223 సర్పంచ్ పదవులకు 683 మంది, 1527 వార్డుల్లో 3,953 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

అనుక్షణం అప్రమత్తంగా..

ప్రచారం ముగియడంతో అభ్యర్థులు చివరి ప్రయత్నంగా ఓటర్లకు తాయిలాలు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. గత పదిహేను రోజులుగా రోజూ మద్యం, విందులతో గ్రామాల్లో కోలాహలం నెలకొన్న విషయం తెలిసిందే. ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు చివరి ప్రయత్నంగా మద్యం, నగదు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కుల, యువజన, మహిళా సంఘాలకు, ఓటర్లకు పంపిణీ చేయాల్సిన నగదు, మద్యం వార్డుల వారీగా సిద్ధం చేసుకున్నారు. సాధారణంగా ఒక్కో ఓటుకు రూ.500 నుంచి రూ.5 వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల మధ్య నెలకొన్న పోటీ తీవ్రత మేరకు ఓటర్లకు నగదు, తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. అయితే అభ్యర్థులు ఇచ్చే తాయిలాలు తీసుకుంటున్న ఓటర్లు తమ ఓటు ఎవరికి వేస్తారనేది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో వలస ఓటర్లు కీలకంగా వ్యవహరించబోతున్నారు.

నిబంధనల ప్రకారమే ర్యాండమైజేషన్

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ర్యాండమైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మొదటి విడత ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్‌ను వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించారు. ఈ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ షేక్ యాస్మిన్‌బాషా సమక్షంలో నిర్వహించారు. మొదటి విడతకు 8 మండలాలలోని

మిగతా 8వ పేజీలో...



ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



వాల్యానాయక్‌తండాలో ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యులు

తుది విడతలో 18 పంచాయతీలు ఏకగ్రీవం

పరిగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుది విడత పరిగి నియోజకవర్గ పరిధిలోని 18 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. తుది విడత నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని 157 పంచాయితీల్లో 18 పంచాయితీలు ఏకగ్రీవం కాగా, 139 పంచాయితీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఏకగ్రీవ పంచాయతీల వివరాలు ఇలా ఉన్నాయి. పరిగి మండలం రూప్‌సింగ్‌తండా, మల్కాయపేట్ తండా, పూడూరు మండలం కొత్తపల్లి, చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్, కిష్టంపల్లి, వాల్యానాయక్‌తాండ, సీర్‌సాబ్‌తాండ, కొత్తపల్లి, లింగంపల్లి పంచాయతీలు యునానిమెస్ అయ్యాయి. అలాగే దోమ మండలంలో దోర్నాల్‌పల్లి, లింగనపల్లి, బ్రాహ్మణపల్లి-పెద్దతండా, గోట్లచెల్కతండా, కిష్టాపూర్, కులకచర్ల మండలం తిరుమలాపూర్, బొట్యానాయక్ తండా, దాస్యానాయక్‌తండా, ఎత్తుకాల్వ తండా పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.

ఎయిర్‌పోర్టులో తప్పిపోయిన బాలుడు

● గంట వ్యవధిలోనే ఆచూకీ కనుగొన్న పోలీసులు


ముస్తఫాను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ సంపతి కనకయ్య

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో మంగళవారం నాలుగేళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ సంపతి కనకయ్య కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఎండీ సల్మాన్ కుటుంబ సభ్యులతో కలిసి రియాద్ నుంచి వస్తున్న బంధువులను రిసీవ్ చేసుకునేందుకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అరైవల్‌లో వేచి ఉండగా సల్మాన్ కుమారుడు ముస్తఫా(4) కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి గంట వ్యవధిలోనే బాలుడిని కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హమీదుల్లానగర్‌కు చెందిన అన్నారం యాదయ్య ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. యాదయ్య చికిత్స నిమిత్తం ఈ నెల 6న శంషాబాద్ ప్రభుత్వాసుపత్రికి వెళ్తున్నానని చెప్పి ఆటోలో వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో యాదయ్య సోదరుడు రాజు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రెండో రోజూ అదే సందడి

(ఐదో పేజీ తరువాయి)

చెందాలంటే మైదానాలు కీలకం. ఈ నేపథ్యంలో నగరానికి చేరువలో అంతర్జాతీయ ప్రమాణాలతో పలు క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని క్రీడాకారులు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఫ్యూచర్ సిటీలో క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, తదితర క్రీడల కోసం అత్యాధునిక మైదానాలు ఏర్పాటు చేసేందుకు సర్కారు అడుగులు వేస్తోంది. అలాగే ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు, వినోదాన్ని అందించేందుకు గానూ ఈ ప్రాంతంలో ఫిల్మ్ సిటీతో పాటు సరదాగా గడిపేందుకు రిసార్ట్‌లను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. సమ్మిట్‌కు హాజరైన బాలీవుడ్, టాలీవుడ్ నిర్మాతలు, సినీ ప్రముఖులతో జరిగిన చర్చలో టూరిజంపై ప్రత్యేక ఫోకస్ పెడుతున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

ఆసక్తిగా స్టాళ్ల పరిశీలన

రెండో రోజుకూడా గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమాలు ఆర్భాటంగా కొనసాగాయి. మంగళవారం కూడా వివిధ దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 10.20 గంటలకు సీఎం


ఈవీ వాహనంపై సినీ నటి అమల విహారం

రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ ద్వారా సమ్మిట్‌కు చేరుకున్నా రు. అనంతరం అతిథులు, పారిశ్రామికవేత్తలతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశమయ్యా రు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అక్కడ ఏర్పాటు చేసిన 40 స్టాళ్లను పరిశీలించారు. ఇందులో విద్య, వైద్యం, వ్యవసాయం, ఫ్యూచర్ సిటీ కమిషనర్ పరిధిలో ఏర్పాటు చేయనున్న చిత్రాలు అతిథులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నగరానికి చెందిన ఓ కళాశాల విద్యార్థులు కేవలం రూ.18 వేలతో వ్యయంతో తయారు చేసిన గ్రాస్ కటింగ్ మిషన్‌ను భట్టి ఆసక్తిగా పరిశీలించారు. ఆ మెషీన్‌ను సచివాలయంలో తన చాంబర్ ఎదుట పర్మినెంట్‌గా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించడం విశేషం.


వెలుగు జిలుగులతో ఆకట్టుకున్న డ్రోన్ల సమూహం


డిజిటల్ స్క్రీన్‌ను తిలకిస్తున్న కార్మికులు

ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా జాగ్రత్తలు

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి తుక్కుగూడ మీదుగా గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామికవేత్తలతో పాటు ప్రముఖుల వాహనాలకు ట్రాఫిక్ అడ్డంకులు తలెత్తకుండా పోలీసులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. తుక్కుగూడ ఔటర్ రింగురోడ్డు నుంచి కొత్తూరు జంక్షన్ వరకు ఆరు ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు.

ప్రముఖుల సందడి

సమావేశాల చివరి రోజు ప్రముఖుల సందడి నెలకొంది. సినీ నటుడు చిరంజీవి, బాలీవుడ్ నటుడు అర్జున్‌కపూర్, నటి జెలినీయా, నిర్మాతలు శ్యాంప్రకాశ్, అల్లు అరవింద్, సురేశ్‌బాబు పాల్గొన్నారు.


ప్రవేశద్వారం వద్ద అతిథులు


సమావేశాల్లో పాల్గొన్న అతిథులు, అధికారులు



ఎయిర్‌పోర్టులో పారిశ్రామికవేత్తల సందడి

● 20 ప్రత్యేక విమానాల్లో గ్లోబల్ సమ్మిట్‌కు..

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రెండు రోజులుగా పారిశ్రామిక వేత్తలు తరలివస్తున్నారు. దాదాపు 20 ప్రత్యేక విమానాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి మీర్‌ఖాన్‌పేట్‌లో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యారు. పెద్దపెద్ద కంపెనీలకు చెందిన డెలిగేట్స్ ప్రత్యేక విమానాల్లో రావడంతో ఎయిర్‌పోర్టులో సందడి నెలకొంది. వీరితో పాటు వివిధ దేశాల నుంచి వచ్చిన డెలిగేట్స్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక వాహనాల్లో గ్లోబల్ సమ్మిట్‌కు వెళ్లారు. నేటితో ముగియనున్న గ్లోబల్ సమ్మిట్ అయితే సామాన్య ప్రజలకు మరో రెండు రోజులు సందర్శన ఉంటోందని అధికారులు తెలిపారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామివేత్తలు, బిల్‌గేట్స్ ప్రముఖులు రానున్న నేపథ్యంలో శంషాబాద్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పారిశ్రామికవేత్తలను ఎయిర్‌పోర్టులో పోలీసులు రిసీవ్ చేసుకుంటున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి గ్లోబల్ సమ్మిట్ వరకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు.


ఎయిర్‌పోర్టులో డెలిగేట్స్‌ను రిసీవ్ చేసుకుంటున్న సీఐ సంపతి కనకయ్య, ఎస్సై శ్రీనివాస్

మున్నూరు కాపు సంఘం ఎన్నికల్లో పాల్గొనాలి



శామీర్‌పేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం మేడ్చల్ జిల్లా నూతన కమిటీ ఎన్నికలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుశోత్తంరావు అన్నారు. మంగళవారం శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పురుశోత్తంరావు విచ్చేసి మాట్లాడారు. ఈ నెల 12న ఉదయం 9 గంటలకు శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తాలోని శుభం గార్డెన్‌లో మేడ్చల్ జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు.

సోనియాగాంధీని తెలంగాణ మరువదు

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు/కడ్తాల్/మహేశ్వరం/కందుకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ, స్వరాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీని తెలంగాణ ప్రజలు ఎప్పటికి మరువబోరని షాద్‌నగర్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఆవరణలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి జరుపుకున్నారు. స్వరాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీకే దక్కిందని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం సోనియా జన్మదిన వేడుకలు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కడ్తాలలో సోనియా జన్మదిన వేడుకల్లో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లు పాల్గొన్నారు. కందుకూరు మహేశ్వరం మండలాల్లో మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నామని సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చాకలిగూడకు చెందిన అలీమ్ మంగళవారం కనకమామిడి నుంచి వెంకటాపూర్ వైపు ఆటోలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు.

ఏరులై పారుతున్న మద్యం



వికారాబాద్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): నేటితో తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగియనుంది. అలాగే సాయంత్రం ఐదు గంటల తర్వాత మద్యం దుకాణాలు సైతం మూతపడనున్నాయి. ఈ నేపథ్యంలో పచ్చని పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. ఓటర్లకు సరఫరా చేసేందుకు పెద్ద మొత్తంలో వైన్స్‌ల నుంచి గ్రామాలకు తరలిస్తున్నారు. సుమారు ఒక్కో గ్రామానికి రూ.లక్ష నుంచి 20 లక్షల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తొలి విడత ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో ఏ మద్యం దుకాణం చూసినా కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. ఈ స్థాయిలో మద్యం అక్రమంగా తరలిస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు ఇంకా అమ్మితే బాగుంటుంది ప్రభుత్వానికి లెక్కలుగా చూపించొచ్చు అన్నట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం. కట్టడి చేయాల్సిన వారే తమకేం సంబంధం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. తనిఖీలు చేయాల్సిన పోలీస్, ఆర్టీఏ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పక్క నియోజకవర్గాలకు స్కూల్ బస్సులు

ఎన్నికల్లో భాగంగా ఆర్టీఏ అధికారులు స్కూల్ బస్సుల మీద దృష్టి సారించారు. రెండు రోజుల పాటు ఎన్నికల పనుల్లో బస్సులను వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ ఈసారి పక్క నియోజకవర్గంలోని పంచాయతీ ఎన్నికల కోసం కూడా వికారాబాద్ నియోజకవర్గంలోని బస్సులనే అడగడం వల్ల ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా చేస్తే రెండు రోజులు పిల్లలకు సెలవు ఇవ్వాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు పంపకపోతే అధికారులు ప్రవర్తన భయపెట్టే విధంగా ఉందని, తమ బస్సులు కాకుండా ఎన్నో ప్రైవేటు వాహనాలు ఉంటాయని వాటిని ఉపయోగించుకుంటే వారికి కూడా ఉపాధి ఇచ్చిన వారు అవుతారని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.

అమ్మా బాగున్నావా.. తమ్ముడూ ఏం చేస్తున్నావ్

- ఊరూరా ఎన్నికల హడావుడి
- ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడుగుతున్న అభ్యర్థులు





దౌల్తాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఊరూరా ఎన్నికల హడావుడి నెలకొంది. మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఈ నెల 11న ఉండడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారం ముగిసినా ఉదయం నుంచి రాత్రి వరకూ ఓటర్లను కలుస్తూ గెలిపించాలని వేడుకుంటున్నారు. సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా పోటీలో నిలిచిన వారు చలిలో సైతం ఇంటింటికీ తిరుగుతున్నారు. కోడి కూయకముందే ఇళ్ల ముందు ప్రత్యక్షమవుతున్నారు. 'అమ్మా బాగున్నావా, తమ్ముడు ఏం చేస్తున్నావ్' అంటూ పలకరిస్తున్నారు. తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో ఎలాగైనా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. కలిసి వారినే మళ్లీ మళ్లీ కలుస్తూ ఓట్లు అడుగుతున్నారు. గతంలో లాగా గోడలపై రాతలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు లేకపోవడంతో ఓటర్లను ఎలాగైనా ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఇది చేస్తాం.. అది చేస్తామని హామీలు ఇవ్వడమే కాకుండా డబ్బు, మద్యంతో ఎరవేస్తున్నారు. కొందరైతే పొలాల వద్దకు వెళ్లి మరీ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

మొదటి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ముగిసిన పంచాయతీ ప్రచారం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరు పాటించాలని ఎంపీడీవో మున్నీ తెలిపారు. సాయంత్రం ఐదు గంటల తరువాత ప్రచారం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. ఇప్పటికే 190 పోలింగ్ బూత్‌లకు బ్యాలెట్ బాక్సులను పంపించామని ఆమె తెలిపారు. ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రతలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఆర్వోలు, పోలింగ్ ఆఫీసర్లు, రిజర్వుడ్ సిబ్బంది మొత్తం 493 మంది ఎన్నికల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ నెల 11న సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమై, మధ్యాహ్నం ఒంటి గంటకు పోలింగ్ ముగుస్తోంది. 2గంటల తరువాత ఓట్లు లెక్కింపు ఉంటాయని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.


పోలింగ్ సెంటర్ వద్ద ఏర్పాట్లపై తెలుసుకుంటున్న ఎంపీడీవో

11 మంది ఉద్యోగులు
పోస్టల్ బ్యాలెట్ వినియోగం

తాండూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో వెళ్లే ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విధుల్లోకి వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులు 117 మంది రెండు రోజులుగా పోస్టల్ బ్యాలెట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ మంగళవారం తెలిపారు.


తాండూరు మండల పరిషత్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న ఉద్యోగులు

మండల పరిషత్‌లోనే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

చేవెళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెండో విడత పంచాయతీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించేందుకు ఈ నెల 11, 12వ తేదీల్లో అవకాశం కల్పిస్తున్నట్లు చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మండల పరిషత్‌లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఈ నెల 13న ఆయా పంచాయతీల పోలింగ్ కేంద్రాలకు తరలిస్తామని తెలిపారు. వాటిని 14న ఎన్నికల అనంతరం ఓట్లను లెక్కించడం జరుగుతుందని ఎంపీడీవో వివరించారు.

ఉద్యోగుల్లో గుబులు రేపుతున్న
పోస్టల్ బ్యాలెట్



కొడంగల్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు గుబులు పడుతున్నారు. గ్రామాల్లో నిర్ణీత సంఖ్యలోనే ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వారిలో ముగ్గురు, నలుగురికి ఎన్నికల విధులుంటే వారు సొంతూళ్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అభ్యర్థి గుర్తుపై వారు సంతకం చేస్తారు. సాధారణ ఓటరులా వారు స్వస్తిక్ సింబల్ వేసే వెసులుబాటు లేదు. బ్యాలెట్ పేపర్‌పై పెన్నుతో టిక్ చేసి పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లో వేస్తారు. లెక్కింపు సమయంలో ఏజెంట్ల ముందే లెక్కిస్తారు కాబట్టి సదరు ఉద్యోగి ఎవరికి ఓటు వేశారనేది తెలుస్తుంది. దీంతో రహస్య ఓటింగ్ లేకుండా పోతుంది. ఓటు పడని అభ్యర్థి తనకు వీరు ఓటు వేయలేదని గుర్తిస్తే మనస్పర్థలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వెనకడుగు వేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ స్వస్తిక్ గుర్తునే వాడాలి



పోస్టల్ బ్యాలెట్‌లో పెన్‌తో టిక్ కాకుండా స్వస్తిక్ గుర్తుతో ఓటు వేయించి లెక్కింపు సమయంలో సాధారణ బ్యాలెట్లలో కలిపితే బాగుటుంది. ఇలా చేస్తే ఉద్యోగి ఎవరికి ఓటేశారో తెలియదు. అందుకోసం కలెక్టర్‌కు, ఎన్నికల సంఘం అధికారులకు టీఎస్‌యూటీఎఫ్ తరఫున వినతిపత్రాలిచ్చాం. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు గోప్యతను కాపాడాల్సి ఉంది.

- ఎఫ్.నర్సిములు టీఎస్‌యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి

ఎన్నికల నిబంధనలు పాటించాలి

చౌదరిగూడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికల ఆదేశాలు పాటించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నచ్చిన వారికి తమ ఓటును వేసుకోవాలని సూచించారు. 11న పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు సహకరించాలని కోరారు.

మినహాయింపు ఇవ్వాలి

బొంరాస్‌పేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల స్టేజ్-2 విధుల్లో ఉన్న అంగవైకల్యం, పాలిచ్చే తల్లులు, గర్భిణి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్ యుటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌరారం గోపాల్, ఎండీ.అలీముద్దీన్ కోరారు. మండల ఎన్నికల అధికారి, ఎంపీడీవో వెంకన్నగౌడ్‌కు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. నరేందర్‌గౌడ్, మల్లేశ్, శివరాజ్ పాల్గొన్నారు.

ఏకగ్రీవాల జోరు

ఎన్నిక పత్రాలు అందుకున్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు

కందుకూరు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలంలో 35సర్పంచ్‌లకు మూడు సర్పంచ్ పదవులు ఏకగ్రీవమైనట్టు ఎంపీడీవో సరిత మంగళవారం తెలిపారు. దావుత్‌గూడ సర్పంచ్‌గా హనుమంత్ నాయక్ ఎంపికయ్యారు. ఇక్కడ వార్డుపదవులకు ఎన్నికలు జరగనున్నాయి. దాసర్లపల్లితండా సర్పంచ్‌గా వి.బుజ్జిలక్ష్మణ్‌నాయక్, ఆరు వార్డులు ఏకగ్రీవమైనట్టు ఎంపీడీవో తెలిపారు. సార్లరావులపల్లి సర్పంచ్‌గా వి.శ్రీనివాస్‌నాయక్ ఏకగ్రీవమయ్యాడు. వార్డు పదవులకు ఎన్నికలుంటాయి. అలాగే మండలంలో మరో 32 పంచాయతీల్లో 30వార్డు పదవులు ఏకగ్రీమయ్యాయని ఎంపీడీవో తెలిపారు. ఇదిలా ఉంటే ఏకగ్రీవ సర్పంచ్ శ్రీనివాస్‌నాయక్‌ను మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏకగ్రీవ సర్పంచ్‌లంతా కాంగ్రెస్ మద్దతుదారులేనని జంగారెడ్డి తెలిపారు.


కందుకూరు: దాసర్లపల్లి తండా సర్పంచ్‌గా ఎన్నికైన బుజ్జీలక్ష్మణ్‌నాయక్, వార్డు సభ్యులు

మహేశ్వరంలో...

మహేశ్వరం: మండలంలోని 30 పంచాయతీలకు ఉప్పుగడ్డతండా, దిలావర్‌గూడ సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయని ఎంపీడీవో శైలజారెడ్డి తెలిపారు. ఉప్పుగడ్డతండా సర్పంచ్ రాజునాయక్, ఉప సర్పంచ్, ఆరుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. దిలావర్‌గూడలో సర్పంచ్ మంజుల ఏకగ్రీవం కాగా ఆరు వార్డులకు ఈ నెల 17న ఎన్నికలు నిర్వహించనున్నారు.

దోమ మండలంలో ఐదు పంచాయతీలు..

దోమ: సర్పంచ్, వార్డు పదవులకు నామినేషన్ల ఉపసంహరణ మంగళవారంతో ముగిసింది. మండలంలో మొత్తం 36 పంచాయతీలు, 308 వార్డుల్లో ఐదు గ్రామాల సర్పంచ్, వార్డు పదవులు ఏకగ్రీవమయ్యాయి. కిష్టాపూర్ సర్పంచ్‌గా వరలక్ష్మి, గొట్లచెల్కతండా-కవిత, లింగన్‌పల్లి-గోపాల్, దోర్నాలపల్లి-సత్యనారాయణరెడ్డి, బ్రాహ్మణపల్లిపెద్ద తండా-సురేఖ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఏకగ్రీవమైన వారికి ఆర్వోలు నియామక పత్రాలు అందజేశారు. మరో 31 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి.


మాడ్గుల మండలంలో ఏకగ్రీవమైన పంచాయతీ సభ్యులు

12 వార్డులు ఏకగ్రీవం

యాచారం: తమ్మలోనిగూడ పంచాయతీలో ఐదు వార్డు పదవులు ఏకగ్రీవమయ్యాయని అధికారులు వెల్లడించారు. మండలంలోని 24 పంచాయతీలకు 83 మంది అభ్యర్థులు.. 220 వార్డు పదవులకు 667మంది పోటీలో ఉన్నారని అధికారులు తెలిపారు. మండల ఎన్నికల పరిశీలకులుగా కల్పనను కలెక్టర్ నియమించారు.

మక్తగూడలో ఏడు వార్డులు ఏకగ్రీవం

కొత్తూర్: మండలంలోని మక్తగూడ పంచాయతీలో ఏడు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఇక్కడ సర్పంచ్, ఒక వార్డుకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ పదవికి శ్రీరాములు, వడ్డె శేఖర్ పోటీలో ఉన్నారు.

బరిలో 37 మంది సర్పంచ్ అభ్యర్థులు

ఆదిభట్ల: పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులకు గుర్తులు ఖరారయ్యాయి. మంగళవారం విత్‌డ్రాల గడువు ముగిసింది. 14 పంచాయతీల్లో 37 మంది అభ్యర్థులు సర్పంచ్ బరిలో ఉన్నారు. 144 వార్డులకు 354 మంది పోటీ పడుతున్నారు. నాలుగు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. బుధవారం నుంచి గ్రామాల్లో గుర్తులతో అభ్యర్థులు ప్రచారం చేయనున్నారు.

సర్పంచ్ పదవులకు 84 మంది పోటీ

మంచాల: మండలంలోని 22పంచాయతీ సర్పంచ్ పదవులకు 84మంది బరిలో ఉన్నారు. మొత్తం 23పంచాయతీలు, 216 వార్డులుండగా కొర్రవానితండా పంచాయతీ ఏకగ్రీవమైంది. కాగజ్‌ఘట్‌లో రెండు వార్డులు, బోడకొండలో ఒక వార్డు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 205 వార్డులకు 622 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

మూడు తండాలు ఏకగ్రీవం

మాడ్గుల:మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో మూడు తండాలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి(ఎంపీడీవో) విజయలక్ష్మి తెలిపారు. కొర్ర తండా సర్పంచ్ కొర్ర జబర్‌లాల్, ఉప సర్పంచ్ కొర్ర బాలునాయక్, 8 వార్డులు ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీవో తెలిపారు. అలాగే సండ్రలగడ్డ తండా సర్పంచ్‌గా సభావత్ జైపాల్, ఉపసర్పంచ్ ఇస్లావత్ నీల, 8వార్డు సభ్యులు, అలాగే పల్లెతండా సర్పంచ్‌గా ఇస్లావత్ సరిత, ఉపర్పంచ్ సేవ, 8 వార్డు సభ్యులు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి విజయలక్ష్మి తెలిపారు. కాగా మండలంలోని 34 పంచాయతీల్లో మొత్తం 59 వార్డు పదవులు ఏకగ్రీవం అయినట్లు అధికారి తెలిపారు. ఏకగ్రీవమైన వారిని ప్రజలు ఘనంగా సన్మానించారు.

నా ప్రమేయం లేకుండానే నామినేషన్ విత్‌డ్రా చేశారు

- కలెక్టర్‌కు సర్పంచ్ అభ్యర్థి ఫిర్యాదు


మాట్లాడుతున్న రాజు

పెద్దేముల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'నా ప్రమేయం లేకుండానే నానామినేషన్ విత్‌డ్రా చేశారు. దానిపై చర్యలు తీసుకోండి.' అని ఆత్కూర్ సర్పంచ్ అభ్యర్థి బ్యాగరి రాజు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే పెద్దేముల్ మండలం ఆత్కూర్ పంచాయతీకి ఈ నెల 11న జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులుగా ఏడుగురు నామినేషన్ వేశారు. అయితే గ్రామస్తులు పంచాయతీకి ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేయాలని భావించారు. సర్పంచ్ పదవికి నామినేషన్లు వేసిన ఆరుగురు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఆత్కూర్ పంచాయతీ ఏకగ్రీవం అయినట్లు అధికారులు ప్రకటించారు. అయితే మంగళవారం ఓ అభ్యర్థి బ్యాగరి రాజు వచ్చి తాను నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకోలేదని, తనకు తెలియకుండానే తన అన్న ద్వారా నామినేషన్ విత్‌డ్రా చేయించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆత్కూర్‌లో ఈ విషయం చర్చనీయాంశమైంది. కలెక్టరేట్‌లో ఈ విషయం ఆయన మీడియాతో మాట్లాడడంతో విషయం బయటపడింది. రాజును సంప్రదించేందుకు ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు


మాట్లాడుతున్న కుసుమ మాధురి

ఆమనగల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అలసత్వం వహించొద్దని జిల్లా సహాయ ఎన్నికల అధికారి కుసుమ మాధురి అన్నారు. ఈ నెల 14న పంచాయతీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లులోని జెడ్పీ బాలుర పాఠశాలలో మంగళవారం పంచాయతీ ఎన్నికల పీవోలు, ఓపీవోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 125మంది పీవోలు శిక్షణకు హాజరయ్యారు. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్‌లపై మాధురి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో పాండు, సిబ్బంది కుమార్, ప్రసన్న, ఝాన్సీ, శ్రీకాంత్, రమేష్, స్టేజ్-2 రిటర్నింగ్ ఆఫీసర్లు శ్రీధర్, అనంతరెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

పరిగి: పంచాయితీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాల్సిన బాధ్యత పీవోలపై ఉందని వికారాబాద్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వాసుచంద్ర అన్నారు. పరిగి శివారులోని రంగాపూర్ రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి, నిర్వహణలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్‌కు ముందు రోజు నుంచి పోలింగ్, ఫలితాలు ప్రకటించే వరకు బాధ్యతగా పనిచేయాలని, ఎవరికీ అనుకూలంగా, ప్రతికూలంగా పనిచేయొద్దని సూచించారు.

ఉప సర్పంచ్ పదవికి పోటీ తీవ్రం



కొడంగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఉప సర్పంచ్ పదవికి తీవ్ర పోటీ ఏర్పడింది. రిజర్వేషన్ ఏదైనా సర్పంచ్‌తో పాటు జాయింట్ చెక్ పవర్ ఉండటమే ఇందుకు కారణం. రిజర్వేషన్లు కలిసిరాని చోట వార్డు మెంబర్‌గా గెలిచి ఉప సర్పంచ్ కావాలని కొందరు పోటీ పడుతున్నారు. ఇందుకు రూ.లక్షలు ఖర్చు చేసేందుకైనా వెనుకాడటం లేదు. గెలుస్తామన్న నమ్మకం ఉన్న కొందరు ఇతర వార్డు సభ్యుల మద్దతు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ నెల 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గంలో అభ్యర్థులు ఓట్లు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు.

తీగాపూర్‌లో బీఆర్ఎస్‌లో కుమ్ములాటలు

- పోలీస్‌స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు

కొత్తూర్, డిసంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి తీగాపూర్‌లో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు పరస్పరం దాడులు చేసుకుని, దూషించుకున్న సంఘటనలపై ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. తీగాపూర్ సర్పంచ్ పదవికి బీఆర్ఎస్ తరఫున బీరంగూడ జయప్రదజగన్మోహన్‌రెడ్డి బరిలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ బలపర్చిన ఇద్దరు అభ్యర్థులు ప్రధానంగా పోటీలో ఉన్నారు. ప్రచారంలో భాగంగా సోమవారం మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తీగాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి కృష్ణయ్య తన అనుచరులు కూడా హాజరై జయప్రదకు మద్దతు తెలిపారు. ఇదిలా ఉంటే మంగళవారం కృష్ణయ్య పాతిమాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థికి ఓటువేయాలని చెబుతున్నారని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని కృష్ణయ్యను నిలదీశారు. ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. తాను కాంగ్రెస్ అభ్యర్థికి ప్రచారం చేయలేదని, అకారణంగా జగన్మోహన్‌రెడ్డి, అతడి అనుచరులు తనపై దాడి చేశారని కృష్ణయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉండి మరో పార్టీ అభ్యర్థికి ప్రచారం ఎలా చేస్తారని అడిగిన తనను కృష్ణయ్య, అతడి అనుచరులు కులం పేరుతో దూషించి దాడి చేశారని బీఆర్ఎస్ నాయకుడు పబ్బె రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు వర్గాల ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి నలుగురి సస్పెండ్

యాచారం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన నలుగురిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.రమేష్‌గౌడ్ మంగళవారం తెలిపారు. పార్టీ ఆదేశం మేరకు సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ ఉపసంహరించుకోకపోవడం, పార్టీ ఆదేశాలను పట్టించుకోనందున ఎం.స్వరూప, ఎం.శ్రీనివాస్, ఎ.గణేష్, వి.కిషన్‌లను అనే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామని తెలిపారు.

మైల్వార్‌లో కిడ్నాప్ కలకలం

- కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి భర్త వాహనం అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు
- అర్ధరాత్రి వాహనంలో తరలింపు
- ఓ ఇంట్లో బంధించారని బాధితుడు ఖలీద్ ఆరోపణ


తన కిడ్నాప్‌పై విలేకరుల సమావేశంలో వివరిస్తున్న ఖలీద్

బషీరాబాద్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):మైల్వార్ గ్రామం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి సీమాసుల్తానా భర్త, మాజీ వైస్ఎంపీపీ ఖలీద్ కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. సోమవారం అర్ధరాత్రి తర్వాత కర్ణాటక రాష్ట్రం అడికి గేటు వద్ద బీఆర్ఎస్ నాయకులు కొందరు ఖలీద్ వాహనాన్ని అడ్డగించి కిడ్నాప్ చేసి వాహనంలో తరలించడంపై రాత్రంతా హైడ్రామా కొనసాగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల తెలిపిన వివరాల ప్రకారం.. ఖలీద్, తాండూరు పట్టణానికి చెందిన రఘునందన్‌కు రూ.20లక్షల చెల్లింపు విషయంలో గొడవలున్నాయి. తీసుకున్న డబ్బులు చెల్లించాలని రఘునందన్ పలుమార్లు అడుగగా, ఖలీద్ రూ.7లక్షల మేర తిరిగి చెల్లించాడు. మిగతా డబ్బు ఖలీద్ చెల్లించలేదు. దీంతో రఘునందన్ మైల్వార్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు అమ్జాద్, దానం రాములుతో కలిసి వాహనంలో తనను కిడ్నాప్ చేశారని ఖలీద్ ఆరోపించారు. సర్పంచ్ ఎన్నికల్లో తన భార్య సీమాసుల్తాన గెలుపు ఖాయమని తెలుసుకుని, తనకు అప్పు ఇచ్చిన వ్యక్తితో కలిసి బీఆర్ఎస్ నాయకులు కిడ్నాప్ ప్లాన్ చేశారన్నారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే పోలీసులను అప్రమత్తం చేయడంతో ప్రాణగండం తప్పిందని ఖలీద్ విలేకరుల సమావేశంలో కన్నీటి పర్యంతమయ్యారు.

ఖలీద్ కిడ్నాప్ జరిగిందిలా..

ఖలీద్ కర్ణాటక రాష్ట్రం గుల్బార్గా నుంచి తాండూరు పట్టణానికి చెందిన అడ్వకేట్ విశ్వనాథం, కాంగ్రెస్ నాయకులు బలారం, అసిఫ్, సైబస్‌లు రాత్రి 11.30గంటల సమయంలో వాహనంలో మైల్వార్‌కు బయలుదేరారు. కర్ణాటక రాష్ట్రం అడికి గేటు వద్దకు చేరుకోగా అక్కడ మాటు వేసిన రఘునందన్, అమ్జాద్, రాములు, విక్కీ, నరేష్ ఖలీద్ వాహనాన్ని రాళ్లతో కొట్టి అడ్డుకున్నారు. రఘునందన్, అమ్జాద్, రాములు తదితరులు ఖలీద్ వాహనంలోని వారందరినీ బయటకు లాగేశారు. ఖలీద్‌ను కిడ్నాప్ చేసి టోల్‌గేటు వద్ద మరో వాహనంలోకి ఎక్కించుకున్నారు. తాండూరు పట్టణం సాయిపూర్‌నకు తరలించి ఓ ఇంట్లో బంధించారని ఖలీద్ ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఖలీద్ సోదరుడు ఖలీల్, స్థానిక నాయకులతో కలిసి ఘటన వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్ నేత అమ్జాద్‌ను పట్టుకుని ఖలీద్‌ను కిడ్నాప్ చేసి ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పాలని ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఖలీద్ ఆచూకీ చెప్పాలని అమ్జాద్‌ను రాత్రంతా వాహనంలో తిప్పి గుర్మిట్‌కల్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. ఖలీద్ కిడ్నాప్ సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఖలీద్‌ను వదిలేయాలని మందలించడంతో కిడ్నాప్ చేర నుంచి బయటపడ్డానని ఖలీద్ వివరించాడు. ఈ విషయమై తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్‌రెడ్డి మంగళవారం బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ జరిపారు. ఇరు వర్గాల ఫిర్యాదులతో కేసులు నమోదు చేశామన్నారు. దర్యాప్తు చేస్తామన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు


పెద్దేముల్: ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న నాయకులు


ఘట్‌కేసర్ రూరల్: ఘనాపూర్‌లో సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మహేశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి


ఘట్‌కేసర్‌లో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏఐసీసీ మాజీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ 79వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నేతలు కేక్‌కట్ చేశారు. పలుచోట్ల సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. 60ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను సాకారం చేసిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, డిసెంబరు 9


మేడ్చల్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


కీసరలో సోనియాగాంధీ జయంతి వేడుకలు


శామీర్‌పేట: మజీద్‌పూర్‌లో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్ అధ్వర్యంలో..


మూడుచింతలపల్లిలో..

క్రీడాకారిణికి అభినందనలు


రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థులతో కోచ్‌లు

పూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 2, 3, 4వ తేదీల్లో నల్గొండ జిల్లా, హలియాలో రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా యాలాల మండలం పగిడ్యాల్ గ్రామానికి చెందిన రామశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచిన 51వ జూనియర్ నేషనల్ క్యాంప్‌నకు ఎంపికైంది. ఈసందర్భంగా జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు పరశురాం, కార్యదర్శి వినోద్‌కుమార్, పూడూరు మండల కార్యదర్శి తిరుమలేష్ క్రీడాకారిణి రామశ్రీ, కోచ్ అనిల్‌కుమార్, క్రీడాకారులను అభినందించారు.

కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలి


మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

పెద్దేముల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి బుద్ధిచెప్పాలని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందనెల్లి, రేగొండి, గాజీపూర్, ఆడికిచర్ల, పాషాపూర్, తట్టెపల్లి, పెద్దేముల్ గ్రామాల్లో ఆయన పర్యటించి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు రమేష్, మాజీ సర్పంచ్ షైదర్, కోహిర్ శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, శిబ్లి ఉన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని కోటబాస్పల్లి , ఐనెల్లి, ఖాంజాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను ప్రజలు ఓటువేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పి.రోహిత్‌రెడ్డి కోరారు. మంగళవారం తాండూరు మండల పరిధిలోని ఐనెల్లి, కోటబాస్పల్లి, ఖాంజపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ స్వరూపా రెడ్డి, వీరేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాకథాన్‌లలో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఏసీఈ ఇంజనీరింగు కళాశాల కార్యదర్శి వైవీ. గోపాలకృష్ణమూర్తి తెలిపారు. అంకుశాపూర్‌లోని ఏసీఈ ఇంజనీరింగు కళాశాలలో 36గంటల పాటు కొనసాగుతున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌ను మంగళవారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, హెచ్‌వోడీ సారధి, కొండ ల్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ర్యాండమైజేషన్

(ఐదో పేజీ తరువాయి)

మొత్తం 262 గ్రామ పంచాయతీలలో 37 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవ ఎన్నికలు జరుపుకోగా, మిగతా 225 గ్రామ పంచాయతీలు, వాటిలోని 1,912 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ విధులు నిర్వర్తించేందుకు మండలాల వారిగా సిబ్బందిని కేటాయించిన వివరాలను వెల్లడించారు. ప్రిసైడింగ్ అధికారులు 2,351, ఓపీఓలు 2743, టూ మెంబర్ టీం 1602, త్రీ మెంబర్ టీం 288, ఫోర్ మెంబర్ టీం 17 మొత్తంగా 1,912 పోలింగ్ సిబ్బందిని పూర్తిగా ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిబంధనల పాటింపు, సిబ్బంది సమర్థ వినియోగం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఆర్‌వో మంగీలాల్, డీపీఓ జయసుధ, నోడల్ అధికారి మాధవరెడ్డి, డీఈఓ రేణుకాదేవి పాల్గొన్నారు.

మొదటి విడతకు సిద్ధం

మొదటి విడతలో 225 సర్పంచ్, 1,912 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి సర్వం సిద్ధ చేసినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు యాస్మిన్ బాషా మాట్లాడుతూ. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General Public is hereby informing that Smt.Patlolla Jyothi W/o Patlolla Venkat Reddy R/O H.NO.1-130, Marepally, Peddemul, Vikarabad Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Tandur Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that the agriculture land bearing Sy. No. 99/UU, Admeasuring Ac. 2-00 Guntas or (0-80 hectors). Situated at Janagam Village, Peddemul Mandal, Vikarabad Dist. And Bounded; North: Panadi. South: Agriculture land of rafi S/o mohd. khaja. East: Agriculture land of chakali mogulappa.West: Agriculture land of Azam khan.

My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

SD/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates,
Off: 4-7-226/109, Sakethnagar,
Vikarabad, Vikarabad. Dist - 501101,
PH: 9246362213; 9603019574.

అధికారులు నిబంధనలు పాటించాలి

● కలెక్టర్ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ నెల 11న మొదటి విడత పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో, 10వ తేదీ ఉదయం 8 గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు తప్పనిసరిగా హాజరవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీపీవో జయసుధ, నోడల్ అధికారి సత్తార్ పాల్గొన్నారు.

కులకచర్ల/చౌడాపూర్: గ్రామ పంచాయతీ ఎన్నికలు నిబంధనల మేరకు సజావుగా జరిగేలా చూడాలని ఎంపీడీవోలు రామకృష్ణ, సోమలింగం అన్నారు. కులకచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో మంగళవారం పీవోలతో సమావేశం ఏర్పాటు చేశారు.

తాండూరు రూరల్: పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ప్రజలంతా ఆయా గ్రామాల్లో స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ కోరారు.

కులకచర్ల: మండల పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం, ఖర్చు, వాహనాల వినియోగంపై కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయని మండల ఎన్నికల నిఘాధికారి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం పోలింగ్‌కు 44గంటల ముందు నిలిపివేయాలని సూచించారు.

నాయకుడి కారులో పీవో ప్రయాణించడంపై చర్చ?

కులకచర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓరాజకీయ పార్టీకి చెందిన నాయకుడి కారులో పోలింగ్ అధికారి (పీవో) ప్రయాణించడం పట్ల మండలంలోని అధికారుల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికలు జరిగే సమయంలో ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలులో ఉంటుంది. దీని ఉద్దేశం ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పని చేస్తున్నట్లు లెక్క. అయితే కొందరు ఉద్యోగులు బరిలో నిలిచిన అభ్యర్థులతో కరచాలనం చేయడం, సన్నిహితంగా ఉండటం, వాహనాల్లో ప్రయాణించడం లాంటివి చేస్తున్నారు. ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని అధికారులు చెబుతున్నారు. దీని వల్ల ఉద్యోగం ఊడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. వారి వాహనాల్లో వెళ్లడం ద్వారా ఆ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నారనే లేదా అనుకూలంగా ఉన్నారనే భావన ప్రజల్లో కలుగుతోంది. దీంతో ఎన్నికల ప్రక్రియపై విశ్వసనీయత సన్నగిల్లే అవకాశం ఉంది. కానీ పీవో నాయకుడి కారులో వెళ్లడంపై అధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

పోటీ నుంచి తప్పుకోవాలని బెదిరిస్తున్నారు

● సర్పంచ్ అభ్యర్థి ఆవేదన


మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

తాండూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ వేసి ఉపసంహరించుకోనందున తనను బెదిరిస్తున్నారని పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థి మంగళవారం కలెక్టర్ ఎస్పీలకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని చంద్రవంచ గ్రామానికి చెందిన పట్లోళ్ల విజయ్‌కుమార్‌రెడ్డి గతనెల 27న చంద్రవంచ గ్రామ పంచాయతీకి నామినేషన్ వేసినట్లు తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన తన చిన్న నాన్న కూడా సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశాడు. దీంతో కొంతమంది గ్రామస్థులు చంద్రవంచ పంచాయతీని ఏకగ్రీవం చేయాలని ప్రయత్నించారు. తనకు ఆఫర్ కూడా ఇచ్చారని అందుకు ఆయన తిరస్కరించడంతో తనకు గ్రామానికి వచ్చి ఎన్నికల్లో ఏజెంట్లను ఎలా పెడుతారు చూస్తామని కొంతమంది భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సుదర్శన్‌రెడ్డి గెలిచే సత్తాలేక ఏక గ్రీవం కావడానికి తనపై ఒత్తిడి తీసుకువచ్చారని ఆరోపించారు. దీంతో తాను 8 రోజుల పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నానని తెలిపారు దీనిపై ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై పోటీలో ఉన్న మరో అభ్యర్థి పట్లోళ్ల సుదర్శన్‌రెడ్డిని వివరణ కోరగా గ్రామస్థుల కోరిక మేరకు ఏకగ్రీవం చేయాలనే ఉద్దేశ్యంతో తనను నామినేషన్ వేయించారని తెలిపారు. అయితే గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో తన ప్రక్షాన గ్రామస్తుల వార్డు సభ్యులందరినీ ఏకగ్రీవంగా తనను ఎన్నుకుంటున్నారని తెలిపారు. విజయ్‌కుమార్‌రెడ్డి పోటీలో ఉన్నప్పటికీ గ్రామంలోకి వచ్చి పోలింగ్ జరుపుకోవచ్చని తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

ఆమె ఓటే శాసనం

(ఐదో పేజీ తరువాయి)

మంది అధికంగా ఉన్నారు. జిల్లాలో 14 పంచాయతీలు మినహా అన్ని పంచాయతీల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం.

మూడు విడతల్లోనూ

మూడు విడతల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో అతివలనే నిర్ణేతలుగా మారారు. తొలి విడతలో జరిగే ఎన్నికల్లో 2,93,552 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనుండగా, వారిలో 1,42,307 మంది పురుషులు ఉండగా, 1,51,237 మంది మహిళలు, ఇతర ఓటర్లు 8 మంది ఉన్నారు. రెండో విడత ఎన్నికల్లో 2,22,457 మంది ఓటర్లు ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనుండగా, వారిలో 1,10,291 మంది పురుషులు, 1,12,165 మంది మహిళలు, ఒకరు ఇతర ఓటరు ఉన్నారు. అదే చివరి విడత ఎన్నికల్లో 1,82,460 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనుండగా, వారిలో పురుషులు 91,090 మంది ఉండగా, మహిళలు 91,363 మంది అలాగే, ఏడుగురు ఇతర ఓటర్లు ఉన్నారు.

వైభవంగా బోనమ్మ జాతర


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

కొడంగల్/కొడంగల్ రూరల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమ్లితండా సమీపంలో గల బోనమ్మ ఆలయంలో బోనాల జాతర ఉత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. భీమ్లితండా, బోయపల్లి తండా, రుద్రారం, టేకుల్‌కోడ్, అన్నారం, రుద్రారం, పాటిమీదిపల్లి, నాగారం తదితర గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. బోనమ్మ అమ్మవారికి మహిళలు బోనాలతో ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం ప్రజలతో కిక్కిరిసిపోయింది. భక్తులు కోడి పుంజులు, మేక పోతులతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

నేషనల్ క్యాంప్‌నకు విద్యార్థిని ఎంపిక


రామశ్రీ

యాలాల, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్యాంప్‌కు యాలాల మండలానికి చెందిన విద్యార్థి ఎంపికైంది. ఈనెల 2, 3, 4వ తేదీల్లో నల్గొండ జిల్లా హలియాలో రాష్ట్ర స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ జరిగాయి. ఈ ఛాంపియన్‌షిప్‌లో యాలాల మండలం పగిడ్యాల్ గ్రామానికి చెందిన రామశ్రీ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి 51వ జూనియర్ నేషనల్ క్యాంప్‌నకు రామశ్రీ ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు పరశురాం, కార్యదర్శి వినోద్‌కుమార్, క్రీడాకారిణి రామశ్రీ, కోచ్ అనిల్‌కుమార్, క్రీడాకారులను అభినందించారు.

తయారీ రంగంలో ఏఐ పాత్ర అద్భుతం


మారుతికి జ్ఞాపికను అందజేస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ తయారీ రంగంలో ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్(ఏఐ) పాత్ర అద్భుతమని టారామైక్రో టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మారుతి అన్నారు. పోచారం సర్కిల్, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన 'ఎడ్జ్ ఏఐ ఇన్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్' పై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆధునిక పరిశ్రమల్లో ఎడ్జ్ ఏఐ పాత్ర తయారీ సాంకేతికతలు, రియల్ టైమ్ ఏఐ అధారిత పరిశ్రమల్లో సమస్యల పరిష్కారా లపై ఎంతగానో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ, ఏఐ, డేటా సైన్స్ విభాగాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌వోడీలు విజయ్‌కుమార్, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీదేవి, అధ్యాపకులు సంతోష్, రాజేశ్వరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్ పేరిట సంబురాలు ఎందుకు?


వికారాబాద్: గులాబీ బెలూన్‌ను వదులుతున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు సంబురాలు జరుపుతున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ప్రశ్నించారు. తెలంగాణ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేసి విజయానికి చిహ్నంగా గులాబీ బెలూన్‌లను గాలిలోకి ఎగురవేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్లోబల్ సమ్మిట్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్ పేరిట సంబురాలు అన్నం పెట్టే రైతులపై అక్రమ కేసులు పెట్టి చేతులకు బేడీలు వేసినందుకా? పంట బీమా అని చెప్పి మోసం చేసినందుకా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠాన్ని చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గోపాల్, ప్రభాకర్ రెడ్డి, మేక చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సురేష్, సుభాన్ రెడ్డి, దేవదాసు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: తెలంగాణ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మేడ్చల్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విష్ణుచారి కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

సంక్షిప్తంగా..

కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి

యాలాల: కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. యాలాల, దేవనూరు గ్రామాల్లో మంగళవారం జరిగిన సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

యాలాల: పగిడ్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పుస్తకాలు అందజేశారు. రామకృష్ణ సేవాసమితి 2000 పుస్తకాలను అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

శామీర్‌పేట: మండల కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా దాతలు సిద్దిపేటకు చెందిన బేతిగంటి కార్తీక్‌గౌడ్- స్రవంతి దంపతులు, కుమారుడు నిహాన్‌గౌడ్‌లు అన్నదానం చేశారు.

ఉత్తమ సేవలకు నిదర్శనం శామీర్‌పేట పోలీసులు

శామీర్‌పేట: శామీర్‌పేట పోలీసులు ఉత్తమ సేవలందిస్తున్నారని అనడానికి దేశ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడమే నిదర్శనమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ వైస్‌ఎంపీపీ వంగరి హృదయ్‌కుమార్ తెలిపారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఉత్తమసేవల్లో దేశస్థాయిలో-7, రాష్ట్ర స్థాయిలో నెంబర్-1 గుర్తింపు పొందిన సందర్భంగా మంగళవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు సోమిరెడ్డి, శశివర్ధన్‌రెడ్డిలను సన్మానించారు.

యాదగిరిగుట్ట బస్సులను ఘట్‌కేసర్ మీదుగా నడపాలి

ఘట్‌కేసర్: స్థానిక రైల్వేవంతెన నిర్మాణ పనుల్లో భాగంగా రెండు సంవత్సరాలుగా ఘట్‌కేసర్‌లోని బైపాస్ నుంచి వెళ్తున్న యాదగిరిగుట్ట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులను తిరిగి ఘట్‌కేసర్ పట్టణం నుంచి నడిపించాలని ఘట్‌కేసర్ జేఏసీ నాయకులు డిపో మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు వేడల్పు పనులు పూర్తయ్యాయని తెలిపారు.

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన స్కూల్ బస్సు

● తప్పిన పెను ప్రమాదం


ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు

కీసర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొంది. ఈ ఘటన మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. చీర్యాల్ చౌరస్తాలోని డీవైన్ గ్రేస్ స్కూల్ బస్సు డ్రైవర్ రాజు నాగారంలోని అరవింద్ నగర్ కాలనీ మొదటి పాయింట్ నుంచి ఇద్దరు స్కూల్ పిల్లలను బస్సు ఎక్కించుకున్నాడు. స్కూల్‌కు వస్తున్న క్రమంలో నాగారం చౌరస్తా నుంచి ముందుకు రాగానే డ్రైవర్ బస్సును నిర్లక్ష్యంగా నడపడంతో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటన జరుగగానే డ్రైవర్ రాజు అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. బస్సులో ఉన్న ఇద్దరు పిల్లలకు స్వల్పగాయాలు కావడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా ఘటనాస్థలానికి చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గతంలోనూ డీవైన్ గ్రేస్ స్కూల్ బస్సు కుందన్‌పల్లి చౌరస్తా వద్ద కూడా ఇలాంటి ఘటన జరిగి పెద్దసంఖ్యలో విద్యార్థులకు గాయాలయ్యాయి. కాగా స్కూల్ యాజమాన్యం అనుభవం లేని వారిని డ్రైవర్లుగా నియమించి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూలర్ల దుకాణంలో అగ్నిప్రమాదం

● గ్యాస్ లీకేజీతో చెలరేగిన మంటలు ● వ్యక్తికి స్వల్పగాయాలు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఘట్‌కేసర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగి కూలర్ల దుకాణం దగ్ధమైంది. ఈ ఘటన పోచారం సర్కిల్ పరిధిలోని అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తాలో మంగళవారం జరిగింది. స్థానికుల, బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాజేష్ అనే వ్యక్తి అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా వద్ద కూలర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. కొద్ది సేపట్లోనే మంటలు షాపుమొత్తం విస్తరించాయి. అప్పటికే షాపులో ఉన్న నాలుగు చిన్న గ్యాస్ సిలిండర్లలో రెండు పేలిపోయాయని స్థానికులు తెలిపారు. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతోపాటు పేలుళ్లతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈప్రమాదంలో షాపు యాజమాని రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మంటలు పెద్దఎత్తున వ్యాపించడంతో దుకాణం పైన విద్యుత్ తీగలు తెగి కిందపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

యువకుడి తలలోకి దూసుకెళ్లిన బ్లేడ్

● పరిస్థితి విషమం ● రాళ్లు కట్ చేస్తుండగా ఘటన

కీసర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాళ్లు కటింగ్‌చేసే స్టోన్ బ్లేడ్ తలలోకి దూసుకెళ్లి యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కీసరలో మంగళవారం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ సర్కిల్ పరిధిలోని నర్సంపల్లికి గ్రామానికి చెందిన షేక్ మౌలానా(26) రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మేరకు రోజు లాగే నర్సంపల్లిలో రాళ్లు కటింగ్ చేసే క్రమంలో రాళ్లు కటింగ్ చేసే బ్లేడ్ ఊడి వేగంగా వచ్చి షేక్ మౌలానా తలకు తగిలింది. దీంతో మౌలానా తల లోపలికి 4 నుంచి 5 అంగుళాలు బ్లేడ్ వెళ్లింది. దీంతో స్థానికులు వెంటనే 108సిబ్బందికి సమాచారం అందజేయగా ఘటనాస్థలానికి చేరుకున్న సిబ్బంది మౌలానాకు ప్రాథమిక చికిత్స అందించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. తల ముందు భాగంలో బ్లేడ్ లోపలికి వెళ్లడంతో సర్జరీ చేయాలని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు 108 సిబ్బంది రవి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ

● ఆరున్నర తులాల బంగారం, 10 తులాల వెండి, నగదు అపహరణ

పరిగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. దోమలో విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మహేందర్, పరిగి మున్సిపల్ పరిధిలోని జయంతినగర్‌లో కొత్తగా ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్నాడు. మహేందర్ కుటుంబం సోమవారం సాయంత్రం బంధువుల దగ్గరకి వెళ్లి తిరిగి మంగళవారం సాయంత్రం ఇంటికి రాగా చోరీ జరిగినట్లు గుర్తించారు. సోమవారం రాత్రి ఈ ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇంటికి వేసిన తాళాన్ని విరగ్గొట్టి లోపలికి వెళ్లారు. ఇంట్లో ఉన్న సీసీకెమెరాల హార్డ్‌డిస్క్ కనెక్షన్ కట్‌చేసి చోరీచేశారు. ఇంట్లో ఉన్న బీరువాలను పగలగొట్టి అందులో ఉన్న ఆరున్నర తులాల బంగారం, 10తులాల వెండి, రూ.77వేల నగదుతోపాటు, రెండు ఫోన్లను చోరీ అయినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, తన సిబ్బందితో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలంలో గంజాయి సాగు.. నిందితుడి అరెస్ట్

● రూ.11లక్షలు విలువ గల 108 మొక్కల స్వాధీనం


నిందితున్ని మిడియా ముందు ప్రవేశపెట్టిన ఎక్సైజ్ అధికారులు

తాండూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పొలంలో గంజాయి సాగుచేస్తున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి అట్టి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా మద్య నిషేద ఆబ్కారీ అధికారి కే.విజయ భాస్కర్ వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. కోట్‌పల్లి మండలం బార్వాద్‌లో ఎర్రోళ్ల పెంటయ్యతో పాటు ఆయన కుమారుడు ఎర్రోళ్ల ప్రభాకర్ గ్రామశివారులో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నారు. తమకు అందిన సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందంతో పాటు తాండూరు ఎక్సైజ్ అధికారుల బృందంతో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. నిందితుడి వద్ద లభించిన 108గంజాయి మొక్కలు, మరో 1.5 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. నిందితుడు ఎర్రోళ్ల పెంటయ్య కుమారుడు ఎర్రోళ్ల ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశామని, పెంటయ్య పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.11లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు ఎక్సైజ్ సీఐ ఎన్.రాణి, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, టీడీఎఫ్ ఎస్ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, తాండూరు ఎక్సైజ్ ఎస్ఐలు నిజాముద్దీన్, రవి కుమార్, సిబ్బంది రవికిరణ్, శివ ప్రసాద్, రమేష్ కుమార్ ఉన్నారు.

సంఘ భవనానికి స్థలాన్ని కేటాయించాలి

మేడ్చల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆర్యవైశ్య భవనానికి స్థలం కేటాయించాలని కుత్బుల్లాపూర్, చింతల్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాకు వినతిపత్రం అందజేశారు. చింతల్‌లోని సర్వేనంబర్ 259లో 40గుంటల భూమి ఉందని అందులో 1500గజాల స్థలాన్ని సంఘం భవనానికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూలూరి విజయ్‌గుప్తా, ప్రభురాజు, కృష్ణకుమార్, కృష్ణమూర్తి, నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.